ఆదిలోని రహస్యము

సృష్టి మొదటి కాలములో కృతయుగమునందు మానవులందరూ ఒకే సమాజముగా ఉండేవారు. ఆనాటి మానవులందు ఏ కులము, ఏ మతము లేదు. కుల మత వ్యత్యాసములు లేని మానవులందరు సమానముగ ఉంటూ, తమకంటే అతీతమైన దైవ మొక్కటున్నదని ఆరాధించెడివారు. అందరు బ్రహ్మవిద్యను తెలిసియుండెడివారు. యోగశాస్త్రమును తప్పనిసరిగ అందరూ ఆచరించుచుండిరి. ఇట్లున్న ఒకే సంఘీభావముగల నాటి మానవులలో వివాహములు చేసుకొను నిమిత్తము, ఆనాటి పెద్దలు వావి వరుసల కొరకు ఏర్పరచబడిన ఇంటిపేరు, గోత్రము తప్ప ఏమి లేవు. ఆనాడు ఏర్పరచిన ఇంటిపేరు గోత్రములు ఈనాటికి గలవు. ఆనాడు మేము పలానా ఇంటిపేరు గలవారమను భావము తప్ప మాది పలానా కులము, పలానా మతము అనుట ఏమాత్రము లేదు.

ఇట్లు కొన్ని వందల సంవత్సరములు జరుగగ, జ్ఞానమున్న స్థానములో అజ్ఞానము చోటు చేసుకొన్నది. కొందరు జ్ఞానులుగా మరికొందరు అజ్ఞానులుగా నిలిచిపోయారు. ఈ విధముగా జ్ఞాన, అజ్ఞానమను రెండు తెగలు మొట్టమొదటిగ మనుషులలో ఏర్పడినవి. రెండు భాగములుగ ఏర్పడిన మానవ జాతిలో జ్ఞానులు గొప్పవారుగ, అజ్ఞానులు తగ్గువారుగ పరిగణింపబడుచుండిరి. బ్రహ్మజ్ఞానము తెలిసిన వారందరు బ్రాహ్మణులుగ పేరుకొచ్చిరి. ఇట్లు మొట్టమొదటిగ ఒక కులము పేరు వచ్చినది. ఆనాటి బ్రహ్మజ్ఞానులు అనగ బ్రాహ్మణులు మిగత అజ్ఞాన తెగవారిని గూర్చి మాకు దిగువనుండెడివారనీ, వారికంటే హెచ్చు జాతివారము మేమని పలుకుచుండిరి. ఈ విధముగ మొదటి భాగమైన బ్రాహ్మణులందరు రెండవ భాగమైన అజ్ఞానులను మాదిగువవారని పల్కుచూ, అజ్ఞానులను వేరు కులముగ పరిగణించిరి. తమకంటే క్రింది జాతి అను ఉద్దేశ్యముతో మాదిగువవారని పల్కెడివారు. కాలక్రమమున **'మాదిగువ'** అను పదము **'మాదిగ'** అనుచు పల్కబడెను. ఈ విధముగ పూర్వము బ్రహ్మజ్ఞానము తెలిసినవారు **బ్రాహ్మణులనీ**, వారి మినహా జ్ఞానము తెలియని వారందరు **'మాదిగ'** వారని రెండే రెండు తెగలు ఉండెడివి.

కృతయుగము మొదటి కాలములో అయితే బ్రాహ్మణులు వారికంటే దిగువవారు అను రెండు జాతులు లేవు. అందరూ జ్ఞానులుగానే ఉండెడివారనుకున్నాము. ఆ కాలమును కుల, మతరహిత కాలమనవచ్చును. మతమను ప్రసక్తే లేని ఆ కాలములో, కులము అను మాటలేని ఆ కాలములో, ఒకరికొకరు వివాహములు చేసుకొను నిమిత్తము వావి వరుసలు మాత్రము పెద్దల చేత ఏర్పరచబడియుండెడివి. ఆనాడు ఒకే తెగగయున్న మనుషులలో వివాహముల నిమిత్తము 108 ఇంటి పేర్లు, 108 గోత్రముల పేర్లలను నియమించి, వాటి ద్వారా 54 ఇంటి పేర్లుగలవారు ఒక రకము తెగయనీ, వారందరు అన్నదమ్ముల వరుస అగుదురనీ తెలిపారు. మరియొక 54 ఇంటి పేర్లు గలవారందరు మరియొక రకమనీ, వారు కూడా అన్నదమ్ముల వరుసకల్గియున్నారని తెలిపారు. ఈ విధముగ రెండు గుంపులుగా ఇంటిపేర్లనుబట్టి నియమించి ఒక గుంపువారు రెండవ గుంపుతో, రెండవ గుంపువారు మొదటి గుంపుతో వివాహ సంబంధములు ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఎప్పుడైనా మనిషి ఇంటి పేరును మరిచిపోతే గోత్రము పేరైనా మతికివుండుననీ, గోత్రమును బట్టి ఇంటిపేరు తెలుసుకోవచ్చునీ, ప్రతి ఇంటిపేరుకు ఒక గోత్రము పేరు అతికించియుండెడివారు. అలాగే గోత్రమును మరిచిపోయినా ఇంటి పేరునుబట్టి తెలుసుకోవచ్చునీ, గోత్రముకు ఇంటిపేరు అతికించారనీ అయినా అనుకోవచ్చును. సమాజములో బయటికి చెప్పుకొనే దానికి ఇంటి పేరునూ, పెళ్ళిలో, దేవుని ఆరాధనలో దేవునికి చెప్పుకోడానికి గోత్రమును ఉపయోగించెడి వారు. ఎన్ని యుగములు మారినా ఈనాటికీ

ఆ పద్ధతి అలాగే ఉన్నదని చెప్పవచ్చును. దైవపూజలలో గోత్రమునూ, సమాజ వ్యవహారములో ఇంటి పేరునూ ఇప్పటికీ చెప్పుచున్నారు. అయినప్పటికీ మొదట పెట్టిన 108 ఇంటి పేర్లు మాత్రమేకాక, పూర్వము నివసించిన ఊరును వదలి మరియొక ఊరిలోనికి వచ్చి స్థిరపడినపుడు, పలానా ఊరువారని చెప్పుచూ కొంత కాలమునకు ఆ పేరునే ఇంటి పేరుగా చెప్పుకొనుట జరుగుచున్నది. ఉదాహరణకు చల్లా అను ఇంటి పేరు గలవారు మాలపాడు అను ఊరిలో నివాసముంటూ, కొంతకాలమునకు ఆ ఊరు వదలి మరియొక ఊరులో నివాసము ఏర్పరుచున్నారనుకొందాము, అపుడు వారు పలానావారని గుర్తింపుకోసరము మాలపాటి వాల్లమని ఊరు పేరును చెప్పుకొనెడివారు. కొంతకాలమునకు ఇంటిలోని పెద్ద చనిపోగా పిల్లలకు అసలైన ఇంటిపేరు తెలియక పోవుటవలన, మాలపాటి అనేదే ఇంటి పేరనుకొనుట వలన, అప్పటినుండి వారి ఇంటి పేరును మాలపాటి వారనియే చెప్పుచుందురు. ఈ విధముగా ఎన్నో ఇంటి పేర్లను మార్చుకొన్నవారు కలరు. దీనిని బట్టి ఇంటి పేర్ల సంఖ్య 108 మారిపోయినది. ఈ విధముగ నిత్యము వ్యవహారములోనున్న ఇంటిపేరు మరచిపోయినవారు ఎల్లప్పుడూ వ్యవహారములో లేని గోత్రమును మరచిపోకుందురా? దీనిని బట్టి ఇంటి పేరు, గోత్రము పేరు మారినవారు కూడా చాలామంది ఉన్నారని తెలియుచున్నది. వాస్తము చెప్పితే నా ఇంటి పేరు నాకు తెలిసినా గోత్రము పేరు మాత్రము తెలియదు. అవసరానికి ఏదో ఒకటి చెప్పవలసి వస్తున్నది. నాలాంటివారు ఎందరున్నారో.

కృతయుగములోనే కొంత కాలము గడువగా అందరూ జ్ఞానులైనా, ఆ సమయములో వారినుండి జ్ఞానులు 95 శాతమునకు దిగిపోయారు. 5 శాతము అజ్ఞానులేర్పడినారు. అపుడు జ్ఞానులు, అజ్ఞానులను రెండు వర్గములేర్పడినవి. రెండు వర్గములలో జ్ఞానము తెలిసినవారు జ్ఞానము తెలియనివారికంటే గొప్పయనీ, తెలియని వారికి క్రింద ఆసనములూ, తెలిసినవారికి ఉన్నత ఆసనములూ ఏర్పాటు చేసిరి. అప్పటినుండి ఏ సభలోనైనా అజ్ఞానులు క్రింద కూర్చొనగా జ్ఞానులు పైన కూర్చోనెడివారు. అప్పటినుండి ఉచ్ఛ నీచ అను వర్గ భేదములు ఏర్పడినవి. జ్ఞానులందరినీ పైవారనీ అజ్ఞానులందరినీ దిగువవారని అనెడివారు. ఇప్పటి కాలములో కూడా జ్ఞానము తెలిసిన స్వామిజీకి పై స్థానములో ఆసనము ఏర్పాటు చేసి, జ్ఞానము తెలియని వారందరూ క్రింద కూర్చోవడము జరుగుచున్నది. అలా తెలిసిన గురువులనుగానీ, స్వాములనుగానీ పైన కూర్చోబెట్టి మిగతావారు క్రింద కూర్చోవడము గౌరవప్రదమైన మన సాంప్రదాయమను చుందురు. అలాపైన కూర్చోన్నవారు క్రింద కూర్చొన్నవారిని మా దిగువవారని అనుట ఈ నాటికి గలదు. ఒక ఉపన్యాస వేదిక మీద ఒక స్వామిజీ కూర్చొని ఉన్నపుడు, ఒక వ్యక్తి స్వామిజీ దగ్గరకు పోయి స్వామిజీ మీరు ఈ పూట ఎవరి ఇంటిలో భోంచేస్తారన్నాడు. దానికి స్వామిజీ “ఆ విషయము మా దిగువవారిని అడుగు తెలుస్తుంది” అన్నాడు. ఇట్లు ఎగువవారూ, దిగువవారూ అను మాటలు కృతయుగములోనే ప్రారంభమైనాయి. అప్పటి నుండి మాయ ప్రభావము పెరుగుచూ, దానిప్రకారమే అజ్ఞానుల సంఖ్య కూడ పెరుగుచూ, కృతయుగములోనే అజ్ఞానుల సంఖ్య 90 శాతము పెరిగి, జ్ఞానుల సంఖ్య కేవలము పది శాతమునకు పడిపోయినది. అప్పుడు బ్రహ్మజ్ఞానులైన బ్రాహ్మణులు “మా సంఖ్య తగ్గిపోయినది, మా దిగువవారి సంఖ్య పెరిగి పోయినది” అని అనెడివారు. ఆనాడు బ్రాహ్మణులు పెట్టిన మా దిగువవారనుమాట నేటికినీ ఒక కులము పేరుతో ఉన్న విషయము అందరికి తెలిసిన విషయమే.

నూటికి 90 మంది గల అజ్ఞానవర్గము మరియొక ఐదు శాతము పెరిగి కృతయుగములోనే 95 శాతమైనది. ఆ సమయములో అజ్ఞాన వర్గమువారు బ్రాహ్మణులు పెట్టిన మా దిగువవారను పేరు నీచమైనదనీ తలచి, ఆ పేరును లేకుండ చేసుకొనుటకు తెలివినుపయోగించి "చేయు పనులను బట్టి కులము" అను మాటను బయటకు తెచ్చారు. ప్రత్యేకమైన పనులు చేయువారు వారి పనినిబట్టి ప్రత్యేకమైన కులము నేర్పరుచు కొన్నారు. ఉదాహరణకు గుడ్డలుతుకువారు చాకలియనీ, గుడ్డలునేయు వాడు సాలెవాడనీ, నేసేవాడనీ, గ్రామ పరిపాలకున్ని రెడ్డియనీ, భూమిని కవులుకు చేయువారిని కమ్మయనీ, ఆవులు, గొర్లుకాయు వానిని గొల్లవాడనీ, పొలములకు కాపలా ఉన్నవారిని బోయవారనీ, నాటకాలాడువానిని భోగమువాడనీ, సర్కస్ ఆట ఆడువానిని దొమ్మరియనీ, వ్యాపారము చేయువారిని కోమటియనీ, రాజ్యమేలువానిని క్షత్రియుడనీ, మాంసము అమ్మువానిని కటికవాడనీ ఇట్లు ఎన్నో కులములు తయారైనవి. అన్ని కులములు మాదిగువ అను వర్గమునుండి పుట్టినవే. అనగా అన్ని కులములకు పుట్టినిల్లు పూర్వము మాదిగువ అని బ్రాహ్మణుల చేత పేరు పెట్టబడిన వర్గమేనని తెలియాలి. ఆ విధముగా మా దిగువ అనబడు వర్గమునుండి ఎన్నో కులములు చీలిపోగా చివరకు ఏ కులము క్రిందికి పోకుండ కొందరు ఆవర్గములోనే మిగిలియున్నారు. వారు నేటికిని మాదిగువవారని పిలువబడుచున్నారు. వాస్తవానికి "మా దిగువ" అనునది అన్ని కులములలాగ ఒక కులమా? అని యోచిస్తే అందరికి పుట్టినిల్లయిన దానిని ఒక కులముగా లెక్కించడము తప్పే. అంతేకాక అది నీచ కులమనడము మరీతప్పు. ఇక్కడొక ప్రశ్నరావచ్చును. మీరే చెప్పారుగా దిగువవారనీ, దిగువ అనినా నీచమనినా రెండు ఒకే అర్థము కదా! అటువంటపుడు నీచకులమంటే తప్పేమి? అని అడుగవచ్చును. దానికి మా జవాబు ఏమనగా! పూర్వము బ్రహ్మజ్ఞానులు ఉండేవారు కనుక వారు అజ్ఞానులను దిగువవారని అనెడివారు. నేటికాలములో బ్రహ్మజ్ఞానము తెలిసినవారే లేనపుడు అందరూ దిగువవారేనని గుర్తుంచుకోవలెను. ద్వాపరయుగము చివరికాలముకే నూటికి నూరు శాతము అజ్ఞానులు తయారైనారు. దానిని గ్రహించిన పరమాత్మ భూమి మీద జ్ఞాన భీజమును నాటుటకు ద్వాపరయుగములోనే కృష్ణునిగ వచ్చి భగవద్గీతను చెప్పి పోయాడు. అది ఇంతవరకు అర్థము కాలేదు. గీతను ప్రమాణ గ్రంథముగా మనుషులు ఒప్పుకోవడములేదు. మాకు వేదాలే ముఖ్యమంటున్నారు. అంతటితో ప్రయోజనములేదనుకొన్న దేవుడు కలియుగములోనే మరియొక మారు పుట్టి గీతలోని సారాంశమునే బోధించాడు. దానిని కూడ ప్రజలు అర్థము చేసుకోలేరని మరియొక మారు నేనే వచ్చి కొన్ని సంవత్సరములు వివరించి చెప్పితేనే అర్థమౌతుందని దేవుడే మరియొకమారు వస్తానన్నాడు. ఆ బోధనా కర్త అయిన దేవుడు ఎపుడు వస్తాడో మనకు తెలియదు. కానీ మనమందరము అజ్ఞానదశలోనే ఉన్నామని తెలియు చున్నది. జ్ఞానము తెలియని మనము నేడు ఏ కులములో ఉండినా కృతయగములోని బ్రహ్మజ్ఞానులు చెప్పినట్లు దిగువవారమే. నేడు కలియుగములో చూస్తే మాదిగువవర్గము నుండి ఎందరో ఎన్నో కులములుగా కృతయుగమునుంచి చీలిపోతూ వచ్చి, ఇప్పటికి మచ్చుకు మాదిగువవర్గము మిగిలియుంది. మనము అక్కడినుండి వచ్చినవారమే కాబట్టి మా దిగువవర్గమును ఒక తగ్గుకులముగా వర్ణించకూడదు. నేడు ఎవరు ఏ కులము పేరుతోయుండినా, జ్ఞానము లేనపుడు మనము కూడా దిగువవారమేనని జ్ఞప్తికల్గి, నేటినుండి బ్రహ్మజ్ఞానమునకు ఆధారమైన భగవద్గీతను చదివి తెలుసుకొని ఎగువవారిగా మారుటకు ప్రయత్నిద్దాము. మీకు చెప్పడమే కాదు బ్రహ్మజ్ఞానము పూర్తిగ తెలియనంతవరకు నేను కూడా దిగువవాడినే. నేను కూడ ఎగువవాడిని కావలెనని ప్రయత్నించుచున్నాను. ఇదంతయు ఆదినుండి వచ్చిన తతంగము. ఈ తతంగము ఎవరికి తెలియదు కావున దీనిని ఆదిలోని రహస్యమంటున్నాము.

మొదటనున్న ఒక తెగనుండియే నేడుగల కులములన్నియు వచ్చినవని చెప్పుటకు ఒక పెద్ద ఆధారముగలదు. అది ఏమనగా! మొదటనున్న ఒకే ఇంటిపేరుతో ఎన్నో కులములు నేడు గలవు. ఉదాహరణకు **గుత్తా అను ఇంటి పేరు రెడ్డి కులములోనున్నది. అదే గుత్తా అను ఇంటి పేరు కమ్మకులములోనూ ఉన్నది. అట్లే మిగత కొన్ని కులములలో కూడ గలదు.** దీనిని బట్టి చూస్తే మొదటనున్న గుత్తా అను ఇంటిపేరుగల ఒక తెగనుండియే అదే పేరుమీదున్న ఎన్నో కులములు పుట్టినవని తెలియుచున్నది. ఈ విధముగా అనేక కులములుగా చీలిపోయిన ఈ మనుషులంతా పూర్వము ఒకే తెగగాయుండిరనీ, ఆనాడు కులములే లేవని తెలియుచున్నది.